# యువకుడు దారుణ హత్య



పిచ్చాటూరు, అక్టోబరు 17 ప్రభాతవార్త: మండల కేంద్రమైన పిచ్చాటూరు ఎగువ భాగంలో ఉన్న అరణియార్ రిజర్వాయర్ లో తట్టు ప్రాంతంలో కోళ్ళఫామ్ సమీపంలోని బహిరంగ ప్రదేశంలో ఓ యువకుడు (35) దారుణ హత్యకు గురైన సంఘటన మంగళవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. సోమవారం రాత్రి పూటుగా మద్యం సేవించి మద్యం మత్తులో ఉన్న యువకుడిని విచక్షణ రహితంగా కత్తితో తలపై నరికి అక్కడే వదిలి వెళ్లిపోయి ఉన్నారు. అతని చేతిపై సింహం గుర్తు గల ట్యాటోలు ఉన్నాయి. బ్లూ ఫ్యాంటు, ఎరుపు షర్టు ధరించి ఉన్నాడు. పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు, స్థానిక ఎస్ఐ వెంకటేశ్వరులు, సంఘటనా స్థలానికి వెళ్లి శవాన్ని పరిశీలించి కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం తిరుపతి నుంచి డాగ్స్ టీం, క్యూజ్ టీం వచ్చి వాటర్ బాటిల్ ఆధారంగా ఫ్రింగర్ ప్రింట్ తీసుకోవడం జరిగింది.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# అన్నపూర్ణ అలంకారంలో శ్రీచెంగాళమాతా పరమేశ్వరి



సూళ్లూరుపేట, అక్టోబర్ 17 ప్రభాతవార్త సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా అమ్మవారు శ్రీ అన్నపూర్ణ అలంకారంలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చింది. అలంకార ఉభయకర్తలుగా కొండేపాటి గంగా ప్రసాద్, కోమలి దంపతులు వ్యవహరించారు. చండీయాగానికి గండవరం లక్ష్మీవరప్రసాదరెడ్డి, కృష్ణజ్యోతిలు ఉభయకర్తలుగా ఉన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా రాయుడు బృందంచే నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, కార్యనిర్వహన అధికారి ఆళ్ల శ్రీనివాసరెడ్డిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మన్నారుపోలూరు, వట్రపాలెం తదితర ప్రాంతాల నుంచి అమ్మణ్ణికి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సారె తీసుకొచ్చి సమర్పించారు. మేళతాళాలతో, వీరుతాళ్లు వేస్తూ, బాణాసంచా కాలుస్తూ భక్తి పూర్వకంగా అమ్మణ్ణికి సారె తీసుకొచ్చి సమర్పించారు.

# పైసా ఖర్చు లేకుండా ఫ్రీగా వైద్యం

## రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజా



నింద్ర, అక్టోబరు 17 ప్రభాతవార్త:

:వైకాపా ప్రభుత్వంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పైసా ఖర్చు లేకుండా ఉచితంగా వైద్యం అందజేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రి ఆర్‌కె రోజా తెలిపారు. మంగళవారం మండలంలోని నెట్టేరి గ్రామ సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథి రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని సచివాలయ పరిధిలో వైద్యసిబ్బంది 15 రోజులు పాటు ఆరోగ్య సర్వేలు బిపి, షుగర్, టెంపరేచర్, పల్స్, పీవర్ సర్వేలు నిర్వహించి వారికి స్లిప్‌లు ఇవ్వడం జరుగుతుందని తెలిపా రు. దేశ చరిత్రలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి భరోసాను ఇస్తూ ఆరోగ్యకరమైన జీవితం వైపు చేయి పట్టుకొని వారిని నడిపిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రజలకు సైతం ఆధునిక వైద్య సేవలు అందిం చేందుకు విలేజ్ క్లినిక్‌లు, రోగుల వద్దకే వైద్యం అందించేలా ప్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను తీసుకొని వచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజల కోసం పనిచేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని, అదే సైన్యంలో పనిచేస్తున్న నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అన్నారు. ఈకార్యక్రమంలో యంపిపి దీపాజలందర్‌రాజు, యంపిడిఓ అరుణ, తహాశీల్దారు యం. భగవతి, వైద్యాధికారి కళ్యాణి, మండల వైకాపా కన్వీనర్ వేణురాజు, సచివాలయ వైకాపా కన్వీనర్ బాబురెడ్డి, కో ఆప్షన్ మెంబరు అనిల్, సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి, జిల్లా వైకాపా కార్యదర్శి మేరీజయరామ్, సర్పంచ్ సుబ్రమణ్యంరాజు, మేళంబాకం కన్వీనర్ మురళీ రాజు, విద్యాశాఖాధికారి శ్రీధర్‌రాజు, ఎపియం చంద్రకళ, నాయకులు దామోధరం, సింగారం, వెంకటేశ్వరరెడ్డి, రమణయ్య యాదవ్, చంద్రబాబురెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, శివలింగ ఆచ్చారి, దినకర్, నామదేవరెడ్డి, సుదాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ముత్యమై మెరిసెను

## -చల్లనిదీవెనలతో భక్తులకు మలయప్పస్వామి కటాక్షం



తిరుమల, అక్టోబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలేశుని నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు మంగళవారం రాత్రి మలయప్పస్వామి ముత్యపుపందిరిపై చల్లనిదీవెనలతో ఊరేగి భక్తులను కటాక్షించారు. రాత్రి 7గంటలకు వాహనమండపంవద్ద ముత్యపుపందిరిపై వేంచేపుచేశారు. స్వామివారి వాహనం బయలుదేరి ఆలయ నాలుగుమాఢవీధుల్లో విహరిస్తూ భక్తులనుకటాక్షించారు. వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, జెఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ నరసింహకిశోర్, అర్చకులు పాల్గొన్నారు.

# అనంతతేజోమూర్తిగా ఆనందనిలయుడు





తిరుమల, అక్టోబర్ 17 ప్రభాతవార్తప్రతినిధి:

ఆనందనిలయంలో కొలువైన అనంతకోటిబ్రహ్మాండనాయకుడు శ్రీవేంకటేశ్వరుడి ఉత్సవమూర్తి మలయప్పస్వామి అనంతతేజోమూర్తిగా "సింహవాహనం"పై భక్తులను కటాక్షించాడు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం యోగనరసింహుడు అలంకారంలో మలయప్పస్వామి భక్తులకు అభయమిచ్చారు. వాహనంముందు గజరాజులు నడుస్తుండగా భక్తజనబృందాలు కోలాటలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తించారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా సాగింది. వాహనసేవలో జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తించారు. సింహ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి దంపతులు, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి దంపతులు, బోర్డుసభ్యులు జఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్‌ఓ నరసింహకిశోర్, సిఈ నాగేశ్వరరావు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, ఆలయ పేష్కార్ శ్రీహరి, అర్చకులు పాల్గొన్నారు. ఏకంగా స్వామివారివాహనాన్ని సేవకులుగా ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి తమ భుజాలపై మోసి భక్తిని చాటుకున్నారు.

# రేపే గరుడసేవ !

## నేటి రాత్రి నుంచి ఘాట్‌లో ద్విచక్రవాహనాలు నిషేధం

## -అలిపిరిలోనే వాహనాల పార్కింగ్

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

దసరా సెలవులు...పవిత్రమైన పెరటాసిమాసంతోబాటు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో గురువారం రాత్రికి (రేపు)గరుడసేవ రావడంతో తిరుమలకు పెద్దసంఖ్యలో భక్తులు చేరుకుంటారని టిటిడి భావిస్తోంది. ఈ నేపధ్యంలోఇందుకు తగ్గట్లు టిటిడి పాలకమండలి, అధికారులు కూడా ముందస్తు ఏర్పాట్లు, చర్యలు తీసుకుంటున్నారు. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ జరగనుండటం, ఈ ఏడాది గరుడసేవ రాత్రి 6.30గంటలకే ప్రారంభమవుతుంది. గరుడసేవను దృష్టిలో వుంచుకుని సామాన్యభక్తులకు స్వామివారి దర్శనం కల్పించడంతోబాటు గరుడసేవను వీక్షించేలా కొండంతా ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటుచేశారు. భక్తుల సౌకర్యాలు, ఏర్పాట్లపై స్వయంగా టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, సివిఎస్‌వో నరసింహకిశోర్, తిరుపతి జిల్లా ఎస్పి పరమేశ్వరరెడ్డి, తిరుమల సిఐలు జగన్మోహన్‌రెడ్డి, బలగాలు భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పర్యవేక్షిస్తున్నారు. నేటి సాయంత్రం నుండి తిరుమల-తిరుపతి .తిరుపతి-తిరుమల మధ్య ద్విచక్రవాహనాలను పూర్తిగా నిషేధించారు. ఈ విషయం ఇప్పటికే టిటిడి సివిఎస్‌ఓ నరసింహకిశోర్ ప్రకటించారు. 24గంటలూ ఘాట్ రోడ్లను తెరచివుంచి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఎప్పటిలాగే భక్తులకు తిరుపతిలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. తిరుమలకు చేరుకునే వాహనాల సంఖ్యను బట్టి 12వేలకు మించితే వాహనాలను అలిపిరిలోనే పార్కింగ్ చేయిస్తారు. ఆలయ మాఢవీధుల్లో భక్తులకు గరుడసేవరోజు అన్నిరకాల ఏర్పాట్లు ,అదనపు మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.

# ఈకెవైసి ప్రక్రియ సత్వరం పూర్తి

## - కలెక్టర్ సగిలి షన్మోహన్



చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త: స్వామిత్వ సర్వే నిర్వహణకు సంబంధించి 13 నోటిఫికేషన్ ఇచ్చిన 7 మండలాల్లో ఈకెవైసి ప్రక్రియను సత్వరం పూర్తి చేయాలని కలెక్టర్ సలిగి షన్మోహన్ ఆదేశించారు. జిల్లా సచివాలయంలోని సమావేశభవనంలో మంగళవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ స్వామిత్వ, ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల స్టేజీ అప్డేషన్, జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఓలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్వామిత్వకు సంబంధించి జిల్లాకు 101 గ్రామాలకు చెందిన మ్యాపులు అందగా రెండు గ్రామాలు అండర్ డీపాపులేషన్‌లో వున్నాయని, 99 గ్రామాల్లో స్వామిత్వ సర్వే ప్రక్రియ జరుగుతున్నదన్నారు. అలాగే 65 గ్రామాల్లో గ్రౌండ్ ట్రూథింగ్ జరుగుతుండగా 34 గ్రామాల్లో పూర్తి కావడం జరిగిందన్నారు. అలాగే గ్రౌండ్ వ్యాలీడేషన్ 29 గ్రామాల్లో పూర్తి అయ్యిందని, 5 గ్రామాల్లో జరుగుతుందన్నారు. అలాగే 13 నోటిఫికేషన్ 25 గ్రామాల్లో పూర్తి అయ్యిందని, 20 గ్రామాల్లో డ్రాఫ్ట్, 5 గ్రామాల్లో ఆర్‌ఓఆర్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అలాగే 13 నోటిఫికేషన్ ఇచ్చిన జిడినెల్లూరు, గుడిపాల, బైరెడ్డిపల్లి, గుడిపల్లి, రామకుప్పం, శాంతిపురం, వి.కోట మండలాల్లో ఈకెవైసి ప్రక్రియను మండల డిప్యూటీ తహసిల్దార్లు తమ లాగిన్లలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, డ్వామా పిడి గంగా భవానీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, సర్వే ఎడి గౌస్‌భాష, నెహ్రు యువజన కేంద్రం కో-ఆర్డినేటర్ ప్రదీప్‌కుమార్, డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ షణ్ముగరామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పరిశోధనలే కాదు.. ప్రజాసేవలోనూ ముందడుగు

## - షార్ సొసైటీకి రెడ్‌క్రాస్ అవార్డు

శ్రీహరికోట (తడ), అక్టోబర్ 17 ప్రభాతవార్త



శ్రీహరికోటలోని షార్ ఉద్యోగులు పరిశోధనలు, రాకెట్ ప్రయోగాల లోనే కాకుండా ప్రజాసేవలోనూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. షార్ ప్రాజెక్టు ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వారు ఇటీవల రక్తదాన శిబిరాలు నిర్వహించి పలువురికి ప్రాణదాతలుగా నిలిచారు. వీరి సేవలను గుర్తించిన రెడ్‌క్రాస్ ఉత్తమ అవార్డును బహూకరించింది. రెడ్‌క్రాస్ ఛైర్మన్, ఎంఎల్‌సి అయిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేతులు మీదుగా సొసైటీ సిబ్బంది అవార్డును స్వీకరించారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ వి.రామాంజనేయ, సిద్ధార్ధ్, మాధవరెడ్డి, మునికృష్ణలు ఈ అవార్డును స్వీకరించారు. తమ సొసైటీ ఆధ్వర్యాన మరికొన్ని ప్రజాసేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా వీరు పేర్కొన్నారు.

# గజలక్ష్మి అలంకరణలో శ్రీమూలస్థాన ఎల్లమ్మ

## ఊంజల్‌పై సేదదీరిన అమ్మవారు

చంద్రగిరి, అక్టోబర్ 17 ప్రభాతవార్త:



గజలక్ష్మి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారు భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరి గ్రామదేవత, సత్యప్రమాణాలకు నెలవై కొలువుదీరిన శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వార్షిక దేవీ నవరాత్రి మహోత్సవాలను ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, పాలక మండలి, ఆలయ ఈఓ సి.ఆర్. తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మ వారి ఆలయ పునర్నిర్మాణం చేపట్టిన నేపథ్యంలో ఉత్సవా లలో అమ్మవారి వాహన సేవలను రద్దు చేసి ఆలయంలో ఊంజల్ సేవ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు సూరి స్వామి అమ్మవారిని విశేష అలంకరణ గా వించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని వివిధరకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గజలక్ష్మి అలంకరణలో ఊంజల్‌పై అధిష్టింజేశారు. అమ్మవారి ఊంజల్ సేవ కన్నుల పండువగా నిర్వహించారు. ఉభయదారులుగా మిట్టపాళ్యంకు చెందిన దివంగత బోయిరెడ్డిగారి చంద్రమౌళి రెడ్డి జ్ఞాపకార్ధం కుమారుడు బోయిరెడ్డిగారి శ్రీనివాసులు రెడ్డి వ్యవహరించారు. అదేవిధంగా తిరుపతికి చెందిన దివంగత కమతం శ్యామలమ్మ జ్ఞాకార్ధం భర్త కమతం చెంగయ్య, తిరుపతికి చెందిన శ్రీనివాసులు రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

# సింహవాహనంపై యోగ నరసింహుడు

తిరుపతిరూరల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:



తుమ్మలగుంటలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలలో మూడోరోజైన మంగళవారం ఉదయం అనంత తేజోమూర్త య్యేన శ్రీనివాసుడు యోగ నరసింహుని అవతారంలో సింహ వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. ఉదయం 7గంటల నుండి 10 గంటల వరకు స్వామి, మాఢవీధుల్లో విహరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వాహనం ముందు అశ్వాలు, వృషభాలు నడుస్తుండగా భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామిని కీర్తిస్తుండగా, మంగళ వాయిద్యాల నడుమ స్వామి, వాహనసేవ ఎంతో కోలాహలంగా జరిగింది.

**ముత్యపు పందిరి వాహనంపై బాలకృష్ణుడు**

శ్రీ కళ్యాణ వేంకన్న మంగళవారం రాత్రి బకాసురుడుని వధించే బాలకృష్ణుని అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. ఉభయదేవేరులతో కలసిన మలయప్ప స్వామి బాలకృష్ణుని అవతారం ధరించి, ముత్యపు పందిరిలో సేదతీరుతూ భక్తులను ఆశీర్వదించారు. స్వామి వాహనసేవలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు, స్వామి వాహన సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, ఆలయ ఈవో సుబ్రమణ్యంరెడ్డి, కంకణ భట్టార్ గిరిధర్ భట్టాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరాడంబరంగా కాణిపాకం ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం

## -ఛైర్మన్‌గా మోహన్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక



కాణిపాకం, అక్టోబర్ 17 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం స్వయంభు శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం పాలకమండలి ప్రమాణ స్వీకారం మంగళవారం నిరాడంబరంగా జరిగింది. నూతనంగా ఏర్పాటైన పాలకమండలి మంగళవారం ఉదయం ప్రధాన ఆలయంలో నిరాడంబరంగా ప్రమాణ స్వీకారం చేసింది. ఉదయం 8.30 గంటలకు ఆలయం వద్దకు చేరుకున్న నూతన పాలకమండలి సభ్యుల చేత ఆలయ ఈఓ ఎ.వెంకటేశు ప్రధాన ఆలయంలోని బంగారు ధ్వజస్థంభం వద్ద ప్రమాణ సీ ్వకారం చేయించారు. ఈమేరకు బోర్డు సభ్యులుగా అగరం మోహన్‌రెడ్డి, పి.గోవర్ధన్, వి.సుశీల, దుడి కాంతమ్మ, మువ్వల నరసింహులు శెట్టి, ఎ.ప్రతిమ, అట్లూరి సుబ్బలక్ష్మమ్మ, గోదా వెంకట రమణమ్మ, జోగి రామసుబ్బమ్మ, బంగాని అనిత, ఎం.జయశ్రీ, ఎక్స్ అఫిషియో సభ్యులు ఎన్.సోమశేఖర్ గురుకుల్ చేత ఈఓ ప్రమాణ సీ ్వకారం చేయించారు. అలాగే కె.గోపీ, రవీంద్రుడు, జి.కొండయ్యలు ప్రమాణ స్వీకారం చేయాల్సి వుంది. ప్రమాణ స్వీకారం అనంతరం సభ్యులు స్థానిక ఈఓ కారా ్యలయం సమావేశ మందిరంలో సమావేశమై పాలకమండలి ఛైర్మన్‌గా అగరం మోహన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. పాలకమండలి నియామక ఉత్తర్వులు సోమవారం రాత్రి అందుకున్న వెంటనే ఆలయ అధికారులకు సమాచారం అందించి మంగళవారం ఉదయం 8గంటల కల్లా ఆలయంలో నిరాడంబరంగా ప్రమాణ సీ ్వకారం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమం నిరాడంబరంగా జరగడంతో స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు, ఆలయ అధికారులు, ఆలయ ఉభయదారులు మాత్రం హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, వైకాపా నాయకులు సిద్దంపల్లె హరిరెడ్డి, అగరంపల్లె జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా నూతనంగా ఏర్పాటైన పాలకమండలి ఛైర్మన్ మోహన్‌రెడ్డి, సభ్యులకు ఆలయ అధికారులు, నాయకులు అభినందనలు తెలిపారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పాలకమండలి ఛైర్మన్, సభ్యులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ముందుగా ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఛైర్మన్, సభ్యులను వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఆలయ అధికారులు పాల్గొన్నారు.

**ఆలయ మరింత అభివృద్ధికి కృషి: ఛైర్మన్ మోహన్‌రెడ్డి**

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం దేవస్థానం కీర్తిప్రతిష్టలు, ప్రాశస్థ్యాన్ని నలు దిశలా వ్యాప్తి చేయించి దేవస్థానం అభివృద్దికి తమ వంతు కృషి చేస్తామని ఆలయ ఛైర్మన్‌గా రెండవ దఫా నియమితులైన అగరం మోహన్‌రెడ్డి తెలిపారు. రెండవ దఫా పాలక మండలి ఏర్పాటుకు సహకరించిన సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు, దేవాదాయశాఖ అధికారులు, ఆలయ ఉభయదారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# పెళ్లకూరు వద్ద ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

## -12 మంది ప్రయాణికులకు గాయాలు



పెళ్లకూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త

పెళ్లకూరు సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 12 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. అనకాపల్లి నుంచి తిరుపతికి దైవ దర్శనానికి 23 మంది భక్తులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో బయలుదేరారు. మార్గం మధ్యలో పెళ్లకూరు జాతీయ రహదారి సమీపంలో ముందు వెళుతున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడింది. ఈ ఘటనలో 12 మంది భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. పెళ్లకూరు ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# నేడు 'మేరా మట్టి మేరా దేశ్' ర్యాలీలు : కలెక్టర్

చిత్తూరు, అక్టోబర్ 17 ప్రభాతవార్త:

నియోజకవర్గ స్థాయిల్లో బుధవారం మేరా మట్టి మేరా దేశ్ ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ సగిలి షన్మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి కలెక్టర్ సగిలి షన్మోహన్ మంగళవారం జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ, ఎంపిడిఓలు, తహసిల్దార్లు, ఇఓఆర్డీలుతో మేరా మట్టి మేరా దేశ్, జగనన్న పాల వెల్లువ, స్వామిత్వ సర్వే తదితరాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిల్లో బుధవారం మేరా మట్టి మేరా దేశ్ ర్యాలీలు నిర్వహించాలని ఈ ర్యాలీలకు నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు భాగస్వాములు కావాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో 2వ విడత 11 మండలాల్లో ప్రారంభించనున్న జగనన్న పాల వెల్లువ కార్యక్రమం సర్వేను బుధవారం సాయంత్రంలోపు పూర్తి చేయాలన్నారు.

# ఆడరో బ్రహ్మాండనాయకుని సేవలో భక్తితో...!



ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
కలియుగవైకుంతం ఏడుకొండలపై శ్రీవేంకటేశ్వరస్వామికి జరుగుతున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం పలువురు కళాకారులు తమ అద్భుతమైన ప్రదర్శనలతో భక్తులను భక్తికి లోనయ్యేలా చేశారు. వైకుంతంలో శ్రీమహావిష్ణువు సేవలో అప్సరసలే అలనాటి పాలసముద్రంలో తమ నాట్యభంగిమలతో ప్రసన్నంచేసుకున్నారు. ఈ రీతిలో సప్తగిరుల్లో కన్నులపండువగా వేంకటేశ్వరుని వాహనసేవల్లో దేశం నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు తమకు తోచిన కళాప్రదర్శనలు అద్భుతంగా ప్రదర్శిస్తున్నారు. స్వామివారి చెంత మేమూ సేవకులమే అంటూ ఆనందపరవశులవుతున్నారు. ఒకరేమిటి వందలసంఖ్యలో నిష్ణాతులైన కళాకారులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కేరళ,కర్నాటక, మహారాష్ట్ర, రాష్ట్రాల నుంచి విచ్చేసి రోజువారీగా జరిగే ఆయా వాహనసేవలకు తగ్గట్లు వేషధారణల్లో తమతమ నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. సింహవాహనసేవలో టిటిడి జెఇఒ సదాభార్గవి, వీరబ్రహ్మం సతీమణి, పలువురు మహిళలు కోలాటోమాడి స్వామివారిసేవలో తరించారు.

## ఎస్వీగోశాలలో దేశవాళీ గోవుల అభివృద్ధి

**-టిటిడి ఈఓ ధర్మారెడ్డి**



తిరుమల,అక్టోబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: దేశవాళీ గోజాతుల అభివృద్ధికి, జన్యుపరమైన సామర్థ్యాన్ని మెరుగుపరిచే లక్ష్యంతో తిరుపతిలోని ఎస్వీగోసంరక్షణశాలలో జాతీయ డెయిరీ డెవపల్‌మెంట్ బోర్డు, టిటిడి సంయుక్తంగా సెంటర్ ఫర్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటుచేస్తోందని టిటిడి ఈఒ ఏవి ధర్మారెడ్డి తెలిపారు. ప్రతిరోజూదేవదేవుని సేవకు 60నుండి వందకిలోల నెయ్యి, 3వేలలీటర్ల పాలు దేశవాళీ గోజాతుల నుండి ఉత్పత్తి చేయడానికి దేశవాళీ గోవులను అభివృద్ధిచేయడమే లక్ష్యంగా టిటిడి పనిచేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలోని సమావేశపుహాలులో శ్రీజ మిల్క్‌ప్రొడ్యూసర్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి, ఎన్‌డిడిబి ఎండి డాక్టర్ దేవానంద్, టిటిడి జెఇఒ సదాభార్గవి, ఎస్‌ఎసిఎఒ బాలాజీ సమావేశమయ్యారు.

## చంద్రఘంట అలంకరణలో తృతీయ దుర్గాదేవి



చంద్రగిరి, అక్టోబర్ 17 ప్రభాతవార్త: తొండవాడ గ్రామ పంచాయతీ పరిధిలో వెలసియున్న శ్రీ ఉగ్రప్రత్యంగిరా దేవతా పీఠంలో దేవీ నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు మంగళ వారం చంద్రఘంట అలంకరణలో తృతీ య దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా పీఠాధిపతి సూరి స్వామి ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల వరకు అమ్మవారికి అభిషేకం, విశేష అలంకరణ గావించారు. ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు అమ్మవారి సన్నిధిలో చంద్రఘంట హోమం జరిపించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

### గజవాహనంపై మిట్ట గంగమ్మ...
## వైభవంగా నవరాత్రి మహోత్సవాలు



చంద్రగిరి, అక్టోబర్ 17 ప్రభాతవార్త: విశేష అలంకృతులైన మిట్ట గంగమ్మ వారు గజవాహనం ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక మిట్ట గంగమ్మ వారి ఆలయంలో ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి నవరాత్రి మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా రెండవ రోజున ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారి అభిషేకాదినిత్యకైంకర్యాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు విశేష అలంకరణ గావించి గజవాహనంపై అధిష్టింప జేశారు. ఈ వాహన సేవకు దివంగత తూకివాకం మంగమ్మ వెంకటరామిరెడ్డి జ్ఞాపకార్థం తూకివాకం ఈశ్వరి చంద్రారెడ్డి (హెరిటేజ్ పార్లర్ చంద్రగిరి) ఉభయ దారులుగా వ్యవహరించారు. అదేవిధంగా వసంత అంగేరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నారాయణమ్మ, మునిరాజా యాదవ్, రమేష్, జల్లా గంగిరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు జల్లా సుబ్రమణ్యం రెడ్డి, జల్లా జనార్ధన్ రెడ్డి, వీరంగారి శ్రీరాములు రెడ్డి పెద్దకుమారుడు వీరంగారి విజయ్‌కుమార్ రెడ్డి జ్ఞాపకార్థం మాజీ జడ్పీటిసి వీరంగారి రమేష్‌రెడ్డి అండ్ బ్రదర్స్, మట్టిరెడ్డి రామచంద్రారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

## అన్నపూర్ణదేవి అలంకారంలో చాముండేశ్వరిదేవి



కోట, అక్టోబర్ 17 ప్రభాతవార్త : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కోట మండలం గూడలి గ్రామంలోని శ్రీచాముండేశ్వరిదేవి ఆలయంలో మూడోరోజు మంగళవారం శ్రీఅన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సకల జీవులకు అన్నం ప్రసాదించే దేవత అన్నపూర్ణదేవి. అన్నం పరబ్రహ్మ స్వరూపం. సర్వ జీవనాధారం. అన్నం లేనిదే జీవులకు మనుగడ లేదు. అన్నపూర్ణదేవి ఎడమ చేతిలోని పాత్రలో ఉన్న అమృత అన్నం వజ్రాలు పొదిగిన గరిటతో తన భర్త అయిన ఈశ్వరునికి భిక్షను అందించే అంశం అద్భుతం. భక్తులు పెద్దసంఖ్యలోఅమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త ఆశం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి.

## శివాలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు



తడ, అక్టోబర్ 17 ప్రభాతవార్త : తడ మండలం వాటంబేడు, బోడిలింగాలపాడు, మాంబట్టు, పాటి మిట్టలలోని శివాలయాల్లో మంగళవారం శరన్నవరాత్రి వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వాటంబేడు కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ప్రసన్న విశాలాక్షి అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. . బోడిలింగాలపాడు భువనేశ్వర స్వామి ఆలయం, పాటిమిట్ట, చినమాంబట్టు ఆలయాల్లో కూడా శరన్నవరాత్రి నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయాలకు ఎక్కువగా తరలి వస్తున్నారు.

## గంగాభవానీ...మహాలక్ష్మీ నమోస్తుతే...!!

బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 17 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మ మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. ప్రముఖ శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా శరవన్నరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3వ రోజైన మంగళవారం అమ్మలనుగన్న గంగమ్మ మహాలక్ష్మీదేవి అవతారమెత్తారు. ఉదయాన్నే వేదపండితులు, అర్చకులచే గంగమ్మకు విశేషాభిషేకం, మహాలక్ష్మీదేవి అలంకరణగా వించారు. ప్రాంగణంలో వేదపండితులు వివిధ హోమాలు, అమ్మవారి సంకల్పం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా హోమం యొక్క విశిష్ట తను భక్తులకు వివరించారు. కురబలకోట అమరావతమ్మ, విశ్వనాథరెడ్డి, చౌడేపల్లి



మాజీ సర్పంచు గాజుల పద్మావతమ్మ, శిరీషా, రాధాకృష్ణ, సుమలత, శ్రీనివాసులు, మిద్దింటి స్వాతి, రాష్ట్ర యువకాపునాడు అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు, మదన పల్లి అశ్విని, ఈశ్వర్‌కుమార్, వి.కోట సుగుణ, చంద్రశేఖర్‌రెడ్డి, పుదిపట్ల దేవిక, సూర్యప్రకాష్, తిరుపతి మాధవి, శివప్రసాద్, గాయత్రి, కాపు సిద్ధారెడ్డి, వినీల, నాగరాజనాయుడు, గుంటూరు హిమబిందురెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రింటింగ్ ప్రెస్ ఛేర్మన్ మురళీ మోహన్ రెడ్డి, స్వర్ణ(పులిచర్ల), పీలేరు కృష్ణచైతన్యరెడ్డి, చార్వికరెడ్డి, సంధ్యారాణి, ఉదయ్ కుమార్‌రెడ్డిలు ఉభయదారులుగా వ్యవహరించారు. వారికి దేవస్థానం వారు అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించి గౌరవించారు. ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఒ చంద్రమౌళీశర్మ, అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

## శ్రీరాజరాజేశ్వరి దేవిగా మరగదాంభిగా అమ్మవారు

కాణిపాకం,అక్టోబర్ 17 ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జరుగు తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం మరగదాంభిగా అమ్మవారు శ్రీరాజ రాజేశ్వరి దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈమేరకు శ్రీమణికంఠేశ్వ రాలయంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అభిషేకాలు నైవేద్యాలను సమర్పించారు. అలాగే అమ్మవారిని శ్రీరాజరాజేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం సామూహిక కుంకుమార్చన, రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ



ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెంటెంట్‌లు కోదండపాణి,శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు సురేష్, బాబు, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## వేసవిలో అగ్నిప్రమాదాల నియంత్రణ

**-శేషాచలంలో సంప్రదాయ మొక్కలు**
**-టిటిడి డిఎఫ్ఓ శ్రీనివాస్**

తిరుమల,అక్టోబర్ 17ప్రభాతవార్తప్రతినిధి: శేషాచలంలో పచ్చదనం పరిరక్షకు ,వేసవిలో అగ్నిప్రమాదాలు నియంత్రణకు నిరంతరం చర్యలు తీసుకుంటూ పర్యవేక్షిస్తున్నామని టిటిడి డిప్యూటీ సిఎఫ్ శ్రీనివాస్ తెలిపారు. చిరుతల బారినుండి భక్తుల రక్షణకు నడకమార్గాల్లో అలిపిరి 70మంది సిబ్బంది, శ్రీవారి మెట్టు మార్గంలో 30మంది సిబ్బంది సేవలందిస్తున్నారన్నారు. అడవుల్లో సంప్రదాయ మొక్కలు పెంపకాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

రిజిస్ట్రేషన్ ప్రకటన
వీలునామా రిజిస్ట్రేషన్

తిరుపతి జిల్లా, తిరుపతి అర్బన్ మండలం, తిరుపతి టౌన్, డోర్. నెం. 18-2-213/c16, అబ్బన్న కాలనీలో కాపురముండిన కీ.శే.బైరెడ్డి వెంకట రెడ్డి గారి కుమారుడు బైరెడ్డి హరినాథ రెడ్డి (వయస్సు 49 సంవత్సరములు) అను అతను తన తదనంతరం తన స్థిర చరాస్తులను (ఫ్లాట్ నెం.04, ఉత్తర మరియు దక్షిణ దిక్కు భాగము మరియు సర్వే నెం.268/1A, బ్లాక్ నెం.08, వార్డ్ నెం.23, న్యూ బాలాజీ కాలని, A.I.R.bypass road building) వారి మేనకోడలు కుమారి వి.కె.వి.ఎ.జస్వంతి మరియు మేనల్లుడు చిరంజీకి వి.కె.వెంకటేష్ లకు చెందవలసినట్లుగా 2023 సంవత్సరం, జనవరి 20వ తేదీన వీలునామా వ్రాయించినట్లున్నూ తరువాత తేది:03.04.2023న సదరు బి.హరినాధ రెడ్డి మరణించినట్లున్నూ తెలుపుచూ పైన తెలిపిన కుమారి వి.కె.వి.ఎ.జస్వంతి 2023 సంవత్సరం, అక్టోబర్ 16వ తేదీన ఒక వీలునామాను రిజిస్ట్రేషన్ కొరకు దాఖలు చేయబడినది. సదరు వీలునామాను గురించి విచారణ ఈ కార్యాలయములో 2023 సంవత్సరం, నవంబర్ 03 వ తేదీన పగలు 11.00 గంటలకు ప్రారంబమగును. కనుక ఆక్షేపణలు కలవారు సదరు తేదీన సాక్షులు మరియు ఆధారములతో సహా హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకో వచ్చును. సాక్షులను సమ్మను చేయించు తేదీకి పదిహేను రోజుల ముందుగా హాజరై సాక్షులను సమ్మను చేయించుకొనవచ్చును.
జిల్లా రిజిస్ట్రారు కార్యాలయము, తిరుపతి. తేది: 16.10.2023.
సం/- బి.కోమలాదేవి
జాయింట్ సబ్ రిజిస్ట్రార్-1

## టిడిపి ప్రజాదరణ ఓర్వలేక అక్రమ అరెస్టు



పుత్తూరు, అక్టోబరు 17 ప్రభాతవార్త : ప్రజల్లో ఒక వైపు చంద్రబాబు నాయుడుకు ఆదరణ, మరో వైపు జగన్ రెడ్డి పాలనపై అసహనం పెరుగుతుండడాన్ని సహించలేక చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని తెలుగుదేశం పార్టీ బిసి సెల్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు సిహెచ్.షణ్ముగరెడ్డి అన్నారు. మంగళవారం రాజమండ్రిలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి మద్దతుగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంఘీభావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అవినీతికి సిఐడి నేటికీ ఆధారాలు చూపించలేకపోయిందన్నారు. ఇదే కేసులో నిందితులుగా వున్న వారికి బెయిల్ ఇచ్చి, చంద్రబాబుకు మాత్రం నిరాకరించడం జగన్‌రెడ్డి కక్ష సాధింపులో భాగమేనని తెలిపారు. జగన్ రెడ్డి కుట్రలకు కాలమే సమాధానం చెబుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ అధికార ప్రతినిధి చుక్కా ధనంజయ యాదవ్, పుత్తూరు పట్టణ అధ్యక్షుడు ఏలుమలైరెడ్డి, ఇంకా హరి, బిడి లక్ష్మీపతి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నాయనూరు అటవీ ప్రాంతంలో ఏనుగులు

కుప్పంరూరల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త : మండలంలోని నాయనూరు అటవీ ప్రాంతంలో రెండు ఏనుగులు మకాం వేశాయి. ఈ రెండు ఏనుగులు తమిళ నాడు ప్రాంతం నుంచి వచ్చినట్లు అటవీ అధికారులు భావిస్తున్నారు. ఇటీవలే తమిళనాడు కాళికోయిల్ వద్ద ఓ రైతును ఏనుగులు హతమార్చిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో అటవీ సరిహద్దు గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. కుప్పంలో మరలా ఏనుగులు ప్రవేశించడంతో జనం కొంత ఆందోళనకు గురవుతున్నారు. మరో పక్క నాయనూరు అటవీ ప్రాంతంలో ఉన్న ఏనుగులపై నిఘా ఉంచి వాటిని తమిళనాడులోకి దారి మళ్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

## లలిత త్రిపుర సుందరిగా ముత్యాలమ్మ



బంగారుపాళ్యం, అక్టోబర్ 17 ప్రభాతవార్త: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంగారుపాళ్యం గ్రామ దేవత ముత్యాలమ్మ లలిత త్రిపుర సుందరిగా మంగళవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని మూల విరాట్ అమ్మవారికి ఆలయ అర్చకులు మురళీ గురుకుల్, కార్తీక్ గురుకుల్‌లు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని లలిత త్రిపుర సుందరిగా వివిధ పుష్పాలతో అలంకరించారు. ఈ ఉత్సవానికి ఉభయదారులుగా బంగారుపాళ్యం సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి, నందిని, రవీంద్రనాయుడు, లోకనాధనాయుడులు వ్యవహరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు. అలాగే వజ్రలపుర బోయకొండపై వెలసిన గంగమ్మ శాఖంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవానికి ఉభయదారులు తుంబకుప్పంకు చెందిన హేమలత, నాగిరెడ్డి, వాణి, హరిబాబు వ్యవహరించారు.

## గాయత్రిదేవిగా కామాక్షాంబిగా.. అన్నపూర్ణదేవిగా అవనాక్షమ్మ అమ్మవారు



నారాయణవనం, అక్టోబర్ 17 ప్రభాతవార్త : మండలంలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో దేవి నవరాత్రి ఉత్సవాల్లో మూడవరోజు అమ్మవార్లు వివిధ రకాల రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అరణ్యంకండ్రిగ పంచాయతీ పరిధి కైలాసనాధకోనలో గాయత్రిదేవి అలంకరణలో కామాక్షాంబిగా అమ్మవారు దర్శనమిచ్చారు. సముదాయం వెలసిన టిటిడి ఆలయం అవనాక్షమ్మ అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో టిటిడి ఎఇఒ పార్థసారధి, సూపరింటెండెంట్ ఏకాంబరం ఆలయ పర్యవేక్షకులు నాగరాజు, ఆర్జితం ఇన్స్‌పెక్టర్ భరత్, కోన ఎండోమెంట్ ఇఒ కృష్ణనాయక్, ఛైర్మన్ ఇ సుబ్రమణ్యంయాదవ్, అర్చకులు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవి అలంకరణ శారదాదేవి



రామచంద్రాపురం, అక్టోబర్ 17 ప్రభాతవార్త: గాయత్రీదేవి అలంకరణలో శారదాదేవి మంగళవారం భక్తులకు దర్శన మిచ్చారు. ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ ఆధ్వర్యంలో అమ్మవారిని వివిధ రకాల సుగంధద్రవ్యాలతో అభిషేకించి, పలురకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం మిట్టవేపకుప్పం, కొత్త వేపకుప్పం, పాత వేపకుప్పం, నెత్తకుప్పం గ్రామాలలో ఊరేగించారు. అమ్మవారిని ప్రతి పంచాయతీలో ఒక్కొక్క అలంకరణలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తామని ప్రతాప్ స్వామీజీ అన్నారు.

## సనాతన హైందవ ధర్మపరిరక్షణ

**-ఎస్వీశిల్పకళాశాల కళాఖండాలకు ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం**
**-టిటిడి డిఈఓ భాస్కర్‌రెడ్డి**



తిరుమల,అక్టోబర్ 17 ప్రభాతవార్త ప్రతినిధి: సనాతన హైందవధర్మాన్ని కాపాడటంలో భాగంగా శిల్పకళాశాలను 1960లో టిటిడి ప్రారంభించిందని టిటిడి డిఈఒ భాస్కర్‌రెడ్డి తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డితో కలసి మంగళవారం రాంభగీచా మీడియాసెంటర్‌లో శిల్పకళాశాల అభివృద్ధి గురించి వివరించారు. ఎస్వీశిల్పకళాశాల కళాఖండాలకు ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం పొందుతోందన్నారు. దాదాపు 800మంది విద్యార్థులు తమ నాలుగేళ్ళ కోర్సును విజయవంతంగా పూర్తిచేసి వివిధ రంగాల్లో స్థిరపడ్డారన్నారు కళాశలలోని ప్రతి విద్యార్థికి లక్షరూపాయలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, వారి కోర్సు పూర్తయిన తరువాత వడ్డీతో సహా వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు.

## ప్రతి కుటుంబానికి ఉచిత వైద్యం అందించడమే జగనన్న ధ్యేయం

**మేయర్ డాక్టర్ శిరీష**

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 17 ప్రభాతవార్త : ప్రతి కుటుంబానికి ఉచిత వైద్యం అందించడమే జగనన్న ధ్యేయమని మేయర్ శిరీష అన్నారు. మంగళవారం 25, 2వ డివిజన్‌లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నగర మేయర్ డాక్టర్ శిరీష పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి ఉచిత వైద్యం, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికి సంజీవిని లాంటిదని అన్నారు. ప్రతి కుటుంబానికి వైద్యం ఉచితంగా అందించాలని జగనన్న ప్రభుత్వ ముఖ్య



ఉద్దేశ్యమని తెలిపారు. ఈ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా మంచి వైద్యం అందుతుందని ప్రజలు అభిప్రాయాలు తెలియజేస్తున్నారని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా పైసా ఖర్చు లేకుంఠ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని వారికి మందులు పంపిణీ చేసి వారి దగ్గర ఉండి వారి ఇంటి వద్దకే చేర్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇంట్లో నుంచి రాని వాళ్లకు వాలంటీర్ల ద్వారా, సచివాలయ సిబ్బంది ద్వారా తెలియజేస్తే ఇంటి వద్దకే వచ్చి వైద్యం అందిస్తారన్నారు. అనంతరం పేషంట్లకు కిట్లు, మందులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహ చారి, రెండో డివిజన్ కార్పొరేటర్ ఉమా యాదవ్, వైఎస్ఆర్‌సిపి సీనియర్ నాయకులు అజయ్, నగర పాలక సూపరిం టెండెంట్ రవి, సీనియర్ అసిస్టెంట్ హరి మోహన్, సుమతి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## కరుణించవమ్మా..కనకదుర్గమ్మా



శ్రీకాళహస్తి, అక్టోబర్ 17 ప్రభాతవార్త : దసరా మహోత్సవాల్లో భాగంగా పట్టణంలో వెలసిన వివిధ ఆలయాల్లో అమ్మవార్లు ఒక్కొక్క అలంకరణలో దర్శనమిస్తున్నారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో వెలసిన అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమివ్వగా, ఏడుగంగమ్మ అమ్మవారు చంద్రఘంటా దేవి అలంకరణలో, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కనకదుర్గాదేవి అమ్మవారు గాయత్రీ దేవిగా దర్శనం ఇవ్వగా, భాస్కరపేటలో వెలసిన చాముండేశ్వరి అమ్మవారు స్కంధమాతగా దర్శనం ఇచ్చారు. వేడాంలో వెలసిన దక్షిణకాళికాదేవి అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనం ఇవ్వగా, నల్లగంగమ్మ ఆలయంలో వెలసిన అమ్మవారు మధురమీనాక్షిదేవి అలంకరణలోను, శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన జ్ఞానప్రసూనాంబికాదేవి అమ్మవారు తపస్సు అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అమ్మవార్లను దర్శించుకోవడానికి పలువురు భక్తులు ఆలయాలకు చేరుకోవడంతో కిటకిటలాడాయి.

## మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గంలో శ్రీకాళహస్తికి అవకాశం



శ్రీకాళహస్తి,అక్టోబర్ 17 ప్రభాతవార్త : రాష్ట్ర బిజెపి కార్యవర్గాల్లో శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రానికి ప్రత్యేక స్థానంలభిస్తుంది.ఈ నేపథ్యంలో మంగళవారం విడుదల చేసినరాష్ట్ర మహిళామోర్చా నూతన కార్యవర్గంలో శ్రీకాళహస్తికి చెందిన చాగణం శైలజకు కార్యదర్శి పగ్గాలు లభించాయి.దాంతో శ్రీకాళహస్తి బిజెపినాయకులు సంబరాలు జరుపుకున్నారు. శ్రీకాళహస్తిలో బిజెపికి పట్టుగొమ్మగా యువనాయకుడు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్ ఉన్నారు. బిజెపి జెండాలు రెప రెప లాడుతున్నాయంటే కోలా ఆనంద్‌కుమార్ శ్రమ అని చెప్పవచ్చు.పార్టీ పదవులను జిల్లా రాష్ట్ర స్థాయిలో కార్యవర్గాల్లో తన అనుయాయులకు అవకాశం కల్పిస్తున్నారు.శ్రీకాళహస్తికి చెందిన చాగణం శైలజను మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించుకొనుటకు కోలా ఆనంద్ కృషి ఫలించిందని చెప్పవచ్చు. కొత్తగా కార్యవర్గంలో అవకాశం కల్పించిన పార్టీ అధ్యక్షురాలు పురంధరేశ్వరి దేవికి ధన్యవాదాలు తెలిపారు.














